విద్యార్థిని చితకబాదిన టీచర్!

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: ఇంగ్లిషు సబ్జెక్టులో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదనే నెపంతో ఓ విద్యార్థిని టీచర్ చితకబాదడంతో తల్లిదండ్రులు, మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్‌లో జరిగింది. ఐదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం ఇంగ్లిష్ టీచర్‌తో పాటు ప్రిన్సిపాల్ కూడా కర్రతో కొట్టడంతో రెండు చేతులకు గాయాలయ్యాయి. గాయమైన చోట రక్తం గడ్డకట్టిందని శుక్రవారం బాధిత విద్యార్థి తల్లిదండ్రులతోపాటు ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నిబంధనలు పాటించకుండా విద్యార్థులను హింసిస్తున్న ఆల్ఫోర్స్ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా అక్కడికి అధికారులు, పోలీసులు రాకపోవడంపై తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 9: ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని హిందూ వాహిని సమాచార సేకరణ ప్రముఖ్ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 19న శివాజీ జయంతి సందర్భంగా సిద్దిపేట వేంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించనున్నారు. దీనికి సంబంధించి గోడపత్రికను శుక్రవారం ఆయన సిద్దిపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివాజీ గణేశ్, బస్వరాజ్, రాజు, సత్యం, ప్రదీప్‌కుమార్, కిరణ్‌కుమార్, లక్ష్మణ్, మాధవరెడ్డి ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 9: సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు అమ్ముడానికి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహిపాల్ అనే వ్యక్తి చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని రైస్‌మిల్‌కు తరలిస్తున్నాడని వచ్చిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. వాహనంలో తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

కార్మికులపై దాడులను ఆపాలి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 9: ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులపై యజమానులు చేస్తున్న దాడులను అరికట్టాలని మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ సభ్యుడు ముక్కెర సంపత్, నాయకుడు కొయ్యడ కొమురయ్య శుక్రవారం ప్రకటనలో కోరారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా రామగిరిలో ఇటుకబట్టీ కార్మికులను యజమానులు హింసించడాన్ని తీవ్రంగా ఖండించారు. వివిధ రాష్ట్రాలనుంచి వలస వచ్చిన కార్మికులకు సరైన సదుపాయాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని ఇటుక బట్టీల్లో కార్మికులపై దాడులు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

PUBLIC NOTICE

The Public in general are hereby informed that Sri. Male Shankaraiah S/o. Narsaiah R/o. H.No.10-103, Gajwel Town has approached my client i.e., ICICI Bank, Branch Gajwel for sanction and release of loan and offered his property of house bearing door No. 10-103 admeasuring 66.66 sq.yards, G+1, Plot No.2 & 3 in Sy.No. 331/1 situated at Gajwel Town and Mandal, Siddipet District and further informed that the original document bearing No. 3692 of 2010 of S.R.O. Gajwel was lost beyond recovery and submitted police certificate issued by S.H.O. Gajwel. In this connection the public are informed to submit objections if any within 7 days of this publication to me for mortgaging the above property in favour of my client-bank. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client-bank will proceed further. Later no objections will be entertained.

Sd/- **G.BHOOMAIAH**
ADVOCATE, Gajwel,
District Siddipet.
Cell No. **9059050784**

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడము ఏమనగా శ్రీ విలాసాగరం సత్యనారాయణ తండ్రి రాజ మల్లయ్య, నివాసం కొత్తపల్లి గార్మి ధరణి రిజిస్టర్ విక్రయ దస్తావేజు నం.లు 1589/2021, 1590/2021 మరియు 181/2022 తహసిల్దార్ మరియు Jt. S.R.O. ఇల్లంతకుంట ద్వారా సంక్రమించిన రాజన్న సిరసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలము ముస్కానిపేట గ్రామములో గల వ్యవసాయ భూమి సర్వే నం.లు 253ఆ/1/2, 252ఉ/2, 253ఆ/1/3, 247రూ/2, 247లు/2/2, 247రు/2, 247ఉ/2, 247ఊ/2, 247ఇ/1/2, 247లు/2/1, 247/రూ/1, 247ఉ/1, 247ఇ/1/1/2, 253ఆ/1/, 247రు/1, 247ఊ/1 మరియు 252ఉ/1/2 వీటి మొత్తం విస్తీర్ణం ఎ. 10-18 1/2 గుంటలు గల ఆస్తి పై యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బెజ్జంకి బ్రాంచ్‌లో లోన్ మంజూరి కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ విలాసాగరం సత్యనారాయణ గారు సదరు ఆస్తి యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నం. 8547/2017 S.R.O. Sircilla గలది పోయినట్లు మరియు బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోగా వారు వెతికిననూ దొరకనట్లు ధృవీకరిస్తూ సర్టిఫికేట్ నం. 15200302241051516740 తేది 03-02-2024 గలది సమర్పించినారు. కావున పై ఆస్తిపై గానీ, ఒరిజినల్ లింకు దస్తావేజు విషయంలో గానీ ఎవరికైనా ఏలాంటి ఆక్షేపణలు ఉన్న సంబంధిత ఒరిజినల్ ఆధారాలతో (7) దినములలోగా నా కార్యాలయంలో సంప్రదించగలరు. గడువు తర్వాత నా క్లయింటు బ్యాంకు సంబంధిత డాక్యుమెంట్ యొక్క నకలు కాపీలతో శ్రీ విలాసాగరం సత్యనారాయణ గార్మి లోన్ మంజూరు చేయుదురు. తదుపరి ఎవరి ఆక్షేపణలు చెల్లనేరవు.

సం/- కె. సాయి నారాయణ, అడ్వకేట్
సిద్దిపేట. సెల్: 9848319114

పీవీకి భారతరత్న గర్వకారణం

భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయం. శుక్రవారం పీవీకి అత్యున్నత పౌర పురస్కారం రావడంపై పలువురు తమ అభిప్రాయాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న దేశాన్ని గాడిన పెట్టిన మహనీయుడని, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పీవీ గ్రామీణ స్థాయి నుంచి దేశ ప్రధానిగా ఎదగడం ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పీవీ కుటుంబానికి ఎంతో గౌరవం ఇచ్చి ఆయన సేవలకు గుర్తింపునిచ్చింది.



తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ..

దుబ్బాక, ఫిబ్రవరి 9: తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం సంతోషకరం. బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల ఆధ్యుడు, తెలంగాణ ప్రతిష్ఠను ఖండంతారాలకు చాటిన గొప్ప వ్యక్తి పీవీకి భారతరత్న ఇవ్వాలని మొదటిసారిగా డిమాండ్ చేసింది తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆరే. కేసీఆర్ ప్రభుత్వంలో శతజయంతి ఉత్సవాలను నిర్వహించాం.
– కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

పీవీ సేవలు అమోఘం

గజ్వేల్, ఫిబ్రవరి 9: బహుభాషా ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రధానిగా చేసిన సేవలు అమోఘం. తెలుగుగడ్డ మీద పుట్టి దేశ ప్రధానిగా ఎదగడం హర్షించదగిన విషయం. ఆర్థిక సంస్కరణలతో ఖ్యాతి పొందారు. 16 భాషాల్లో అనర్గళంగా మట్లాడగలిగే సత్తా ఆయనది. ఆయనకు గత ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. – డాక్టర్ యాదవరెడ్డి, ఎమ్మెల్సీ

కష్టాల్లో ఉన్న దేశాన్ని గట్టెక్కించారు

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావుకు భారతరత్న అవార్డు రావడం తెలంగాణకు గర్వకారణం. కష్టాల్లో ఉన్న దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ఆదుకున్నది పీవీ మాత్రమే.. దేశానికి పీవీ చేసిన సేవలు ఎనలేనివి. ఆయన పుట్టిన గడ్డకు ఎమ్మెల్యేగా ఉండి, మంత్రిగా పనిచేయడం నా అదృష్టం.
– పొన్నం ప్రభాకర్, మంత్రి

తెలుగువారిగా గర్వపడుతున్నాం

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 9: దివంగత పీవీ నరసింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలంగాణకు గర్వకారణం. గతంలో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా పీవీని గుర్తు చేసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్న ప్రకటించి తగిన న్యాయం చేసింది. ఇది తెలుగువారికి గొప్ప విషయం. – ఎన్సీ రాజమౌళి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్

బహుభాషా కోవిదుడు

సిద్దిపేట, ఫిబ్రవరి 9: తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం హర్షణీయం. దక్షిణ భారతం నుంచి ప్రధానిగా సేవలందించిన గొప్ప వ్యక్తి పీవీ. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పీవీకి భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు.
– మేర్గు మహేశ్, బీఆర్ఎస్ నాయకుడు

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. – గజ్వేల్, ఫిబ్రవరి 9

మంత్రాల నెపంతో వ్యక్తి హత్య

నంగునూరు, ఫిబ్రవరి 9: మంత్రాల నెపంతో ఓ వ్యక్తిని హత్యచేసిన ఘటన మండలంలోని ఘనపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఘనపూర్ మాజీసర్పంచ్ భర్త బత్తుల తిరుపతి తన బిడ్డ అనారోగ్యానికి అదే గ్రామానికి చెందిన బండి వెంకటయ్య కారణమని భావించాడు. ఎలాగైనా వెంకటయ్యను చంపితేనే తన బిడ్డ ఆరోగ్యం బాగుంటుందని అనుకున్నాడు. దీంతో వెంకటయ్యను హతమార్చేందుకు నంగునూరుకు చెందిన పరశురాములు, సాయిగౌడ్‌తో రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.50 వేలు, మరో పది రోజులకు రూ.లక్ష అడ్వాన్స్ తీసుకున్నారు. ఈ నెల 3న నంగునూరు నుంచి ఘనపూర్ వైపు వెళ్తున్న వెంకటయ్యను పరశురాములు, సాయిగౌడ్‌తో పాటు మరో ముగ్గురు సాయి, అరవింద్, రంజిత్ సహాయంతో బైక్‌పై వెంబడించారు. ఘనపూర్ శివారులోకి వెళ్లగానే వెంకటయ్య బైక్‌ను ఢీకొట్టారు. వారు వెంట తెచ్చుకున్న తువాలు, తాడు సహాయంతో వెంకటయ్యను హతమార్చి.. జేసీబీ గుంతలో పడవేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు.

ఆటోడ్రైవర్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 9: మండలంలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుర్ర కర్ణాకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, ఆయన మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆటోను నమ్మికొని బతుకుతున్న వారిని ఆర్థికంగా చితికిపోయేలా చేయడం సరైంది కాదన్నారు. ఆటో డ్రైవర్లకు జీవన భృతి కింద నెలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, రాజయ్య, ప్రభాకర్, ధర్మయ్య, దేవరాజ్, రమేశ్ ఉన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

కొమురవెల్లి ఒగ్గు పూజారి మృతి

చేర్యాల, ఫిబ్రవరి 9: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారి బైరి ఐలయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి పరామర్శించి సంతాపం ప్రకటించారు. అనంతరం ఆలయం నుంచి ఒగ్గు పూజారికి అందాల్సిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భద్రప్ప, బచ్చల శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, నాయకులు మహాదేవుని శ్రీనివాస్, ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య, సభ్యులు రాములు, మల్లేశం, పర్వతాలు, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీశైలం, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి

అభివృద్ధి పనులకు టెండర్లు చేపట్టాలి

దుబ్బాక/దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ ప్రభుత్వంలో దుబ్బాక మున్సిపల్‌కు మంజూరైన టీయూఎఫ్ఐడీసీ రూ.10 కోట్లకు సంబంధించిన పనుల టెండర్లు పూర్తి చేపట్టాలని కలెక్టర్ ప్రశాంత్ జీవనపాటిల్‌కు దుబ్బాక మున్సిపల్ పాలకవర్గం కలిసి విన్నవించింది. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డితోపాటు పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. టీయూఎఫ్‌డీసీ నిధులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు నిర్వహించాలని విన్నవించారు. బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, బాలకిషన్‌గౌడ్, బట్టు ఎల్లం ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి

'కూడవెల్లి'లో వ్యక్తి గల్లంతు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 9: మాఘ అమావాస్య సందర్భంగా కూడవెల్లి వాగులో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దెల స్వామి(41) తన కుటుంబీకులతో కలిసి శుక్రవారం కూడవెల్లి వాగులో స్నానం చేసి సీతారాములను దర్శించుకొనేందుకు వెళ్లాడు. కుటుంబీకులు కూడవెల్లి వాగు ఒడ్డున ఉండగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగులో ఈత కొట్టాడు. చెక్‌డ్యామ్ వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో దిగువన ఉన్న చెక్ డ్యామ్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అక్కడే ఈత కొడుతున్న యువకులు అతడిని కాపాడడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

చేర్యాల, ఫిబ్రవరి 9: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ చేర్యాల ఏడీఏ రాధిక తనిఖీ చేశారు. శివసాయి ఫర్టిలైజర్‌లో ఈపాస్ మిషన్‌లో ఇప్పటి వరకు రైతులు నమోదు చేసుకున్న ఆధార్ వివరాలు, రికార్డులు తదితర వాటిని పరిశీలించారు. షాపు యజమాని చేతిరెడ్డి సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూటి పల్లి బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

చేర్యాల మండలంలో...

చేర్యాల, ఫిబ్రవరి 9: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో 27,000 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అప్రోజ్, ఎరువుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

'చాకలికుంట' కబ్జాను అడ్డుకోవాలి

కొండపాక, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని దుద్దెడ టోల్‌గేట్ వద్దగల చాకలికుంటను, నక్ష బాటను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి గోడ నిర్మిస్తున్నారని దుద్దెడ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాతలకాలం నుంచి అక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయని, అప్పటినుంచి పొలాలకు కుంట, నక్ష ఉండేదన్నారు. ఇటీవల కొందరు రియల్టర్లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ చల్లా శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.

న్యాయం చేయాలి

నోటిమాట, సాదా కాగితం ద్వారా 60 ఏండ్ల క్రితం కొనుగోలు చేసి సాగు చేస్తున్న భూములను కొంతమంది వ్యక్తులు తిరిగి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుద్దెడ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్నే నమ్ముకుని బతుకుతున్న తమకు న్యాయం చేయాలని శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దుద్దెడ గ్రామంలోని సర్వే నంబర్ 456, 457, 458, 463తోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో ఉన్న భూమిని నర్ర లలితాబాయ్ అలియాస్ గుర్రాల లలితాబాయ్ వద్ద నుంచి 50 ఏండ్ల క్రితం సాదా కాగితం, నోటిమాట ద్వారా కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఆ భూములకు సంబంధించి కొన్ని వివరాలు ధరణిలో నమోదు కాలేదని, ఇప్పటికీ ధరణిలో లలితాబాయి పేరుపైనే రికార్డు ఉండడంతో లలితాబాయ్ వారసుడైన అమరేందర్‌రెడ్డి ఆ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు వ్యక్తులతో సర్వే చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9: భారత ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరపాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్ పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గోడౌన్ చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈవీఎంలను ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను పకడ్బందీగా జరపాలని టెక్నికల్ ఇంజనీర్లను ఆదేశించారు.

విద్యార్థులకు పరీక్షాప్యాడ్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

అంబేద్కర్ స్ఫూర్తిగా చదువులో రాణించాలి

వర్గల్, ఫిబ్రవరి 9: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూనే చదువులోనూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని జీవితలక్ష్యాలను చేరుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం చౌదర్‌నల్లి ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు తన జన్మదినం సందర్భంగా ఉచితంగా పరీక్షా ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ వివేకం అనేది విద్యతోనే వస్తుందని, వివేకం గల విద్యార్థులు చదువును, సమయాన్ని వృథా చేయరన్నారు. ప్రతి విద్యార్థి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని చదవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ, మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎంలు సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, నాగరాజు, స్వప్నప్రియ, భారతి, శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇసుక డంపులపై దాడులు

గజ్వేల్, ఫిబ్రవరి 9: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. నమ్మదగిన సమాచారంలో గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కన, వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారి పక్కన అనుమతి లేకుండా అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ప్రజ్ఞాపూర్ వద్ద ప్రజ్ఞాపూర్‌కు చెందిన గుడికందుల నరేందర్, శ్రీరామకృష్ణ, దాతర్‌పల్లికి చెందిన గుడికందుల గణేశ్, గోపాలకృష్ణ, కుకునూరుపల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి, గౌరారం వద్ద వర్గల్‌కు చెందిన మామిండ్ల స్వామి ఇసుకను డంపు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

గజ్వేల్, ఫిబ్రవరి 9: ఎలాంటి అనుమతి లేకుండా చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గురువారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని బెజుగామ చెరువులో నుంచి నల్లమట్టిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారంతో రాత్రి 11 గంటల సమయంలో చెరువులో నుంచి మట్టితో వెళ్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఏడాది చెరువులో నుంచి వ్యాపారులు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

క్రీడాకారులతో సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 9: సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం ఆకాంక్షించారు. శుక్రవారం సిద్దిపేటలోని ఆచార్య జయశంకర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఈనెల 10 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. దాత బెజ్జంకి జెడ్పీటీసీ కానగండ్ల కవితాతిరుపతిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకట స్వామిగౌడ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షుడు కనకారెడ్డి, జట్టు కోచ్‌లు కృష్ణకుమార్, నిశాంక్‌గౌడ్, విజయ్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థిని సుష్మను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ

మర్కూక్, ఫిబ్రవరి 9: ఆర్ఎస్‌బీవీపీ 2023 సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం పోటీల్లో మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంటకు చెందిన విద్యార్థిని సుష్మకు ప్రథమ బహుమతి లభించింది. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య సహకారంతో వ్యవసాయం ఉపఅంశంపై తన ప్రయోగాన్ని ప్రదర్శించింది. దీనికి ప్రథమ బహుమతి దక్కించుకున్న సుష్మ, గైడ్‌గా వ్యవహరించిన చిన్న బ్రహ్మయ్యను ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములు, ఉపాధ్యాయులు, ఎస్ఏంసీ చైర్మన్ అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చేర్యాల, ఫిబ్రవరి 9: మాజీ జడ్పీటీసీ నర్సింగరావు తల్లి ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి చేర్యాలలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్ర